క్లుప్తంగా

ఆక్రమణల తొలగింపు



కాలువ పొరంబోకు స్థలంలో ఆక్రమణలను తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

తిరుపతి మంగళం : మంగళం పరిధిలోని ఆర్టీఓ కార్యాలయం ఎదురుగా ఉన్న ప్రధాన మార్గంలోని కాలువ పొరంబోకు స్థలంలో ఆక్రమణలను మంగళవారం రెవెన్యూ అధికారులు సతీష్, ప్రసాద్ జేసీబీతో తొలగించారు. ప్రభుత్వ భూముల్లో కానీ కాలువ, చెరువు స్థలాలలో ఎవరైనా ఆక్రమణలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు హెచ్చరించారు.

పదోన్నతుల సమస్యపై సానుకూల స్పందన

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : టీటీడీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల పదోన్నతుల్లో నెలకొన్న రిజర్వేషన్ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని టీటీడీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ మేడికొండ ప్రసాద్ రావు, ప్రధాన కార్యదర్శి జె.భాస్కర్ తెలిపారు. ఈ మేరకు వారు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలను టీటీడీ యాజమాన్యం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిందన్నారు. ఎస్సీ, ఎస్టీ పదోన్నతుల్లో కాన్సిక్వెన్షియల్ సీనియారిటీ ప్రకారం పదోన్నతులు ఇవ్వాలనే అంశాలపై ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన లభించిందన్నారు. టీటీడీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల ప్రధానమైన సమస్య పదోన్నతుల్లో రిజర్వేషన్ కల్పించడం అన్నారు. వెంటనే టీటీడీ యాజమాన్యం అందరికీ ప్రభుత్వ ఆదేశాల మేరకు పదోన్నతుల్లో రిజర్వేషన్‌ను అనుకరిస్తూ పదోన్నతులు వెంటనే చేపట్టాలని కోరారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు





సినీ నిర్మాత దిల్ రాజు, కర్ణాటక మంత్రి శివరాజ్ తంగాడగ్

తిరుమల: తిరుమల శ్రీవారిని మంగళవారం సినీ నిర్మాత దిల్ రాజు, కర్ణాటక మంత్రి శివరాజ్ తంగాడగ్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

అమ్మవారి సేవలో ప్రముఖులు



ఆలయం వెలుపల మాజీ డీజీపీ

చంద్రగిరి: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని రాష్ట్ర మాజీ డీజీపీ ద్వారకా తిరుమలరావు, ప్రముఖ సినీ నిర్మాత దిల్ రాజు వేర్వేరుగా వచ్చి కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ఆలయ ధ్వజస్తంభం వద్ద మొక్కుకుని అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

రీవాల్యుయేషన్‌లో కుమార్ విద్యార్థినికి టాప్ మార్కులు



విద్యార్థినిని అభినందిస్తున్న అపుస్మా నాయకులు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి నెహ్రూనగర్‌లోని కుమార్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ విద్యార్థిని సి.భవ్య రీవాల్యుయేషన్‌లో టాప్ మార్కులు సాధించింది. తెలుగులో 96 నుంచి 100 మార్కులు, ఇంగ్లిష్‌లో 94 నుంచి 98 మార్కులు పెరగడంతో 588 నుంచి 596 మార్కులకు పెరగడంతో రాష్ట్రస్థాయిలో ఉత్తమ ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా మంగళవారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో అపుస్మా నాయకులు డాక్టర్ ఎస్.విశ్వనాథరెడ్డి, రెడ్డి శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ టి.రామకృష్ణారెడ్డి, డిజి.రఘునారాయణ రావు విద్యార్థినిని అభినందించారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ పి.వెంకటేష్‌బాబు, హెచ్ఎం జి.రాజ్యలక్ష్మి, జాయింట్ డైరెక్టర్ హేమచందు భవ్యకు రూ.10 వేలు నగదు ప్రోత్సాహక బహుమతిని అందజేశారు.

డీఎంహెచ్‌ఓకు వినతి



డీఎంహెచ్‌ఓను కలిసిన 104 నిర్వహణ సంస్థ ప్రతినిధులు

తిరుపతి తుడా: జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ బాలకృష్ణనాయక్‌ను 104 నిర్వహణ సంస్థ భవ్య ప్రతినిధుల బృందం మంగళవారం జిల్లా కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం మొబైల్ మెడికల్ యూనిట్లను సందర్శించి రోగులు, సహాయకులతో మాట్లాడారు. అనంతరం డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ 104 సేవలు మరింత మెరుగ్గా రోగులకు అందాలని సూచించారు. ఆయనను కలిసిన వారిలో 104 అడిషనల్ డైరెక్టర్ అనిల్ కుమార్, రీజనల్ మేనేజర్ ఖలీమ్, జిల్లా మేనేజర్ శేషసైనారెడ్డి, రాజేష్, రాకేష్ ఉన్నారు.

నిర్లక్ష్యపు 'వెలుగులు'..!



దుర్గసముద్రం పాత పంచాయతీ కార్యాలయం వద్ద పగలే వెలుగుతున్న వీధిలైట్

గ్రామ పంచాయతీల్లో నిధులు లేక నిర్వహణకు ఆర్థిక కష్టాలతో ఇబ్బంది పడుతున్నారు. చాలా చోట్ల లక్షలాది రూపాయల విద్యుత్ బిల్లులు కూడా చెల్లించలేని దుస్థితి. అలాంటి పరిస్థితుల్లో మూలిగే నక్కపై తాటికాయ పడిన చందాన విద్యుత్తు శాఖ అధికారులు నిర్లక్ష్యం కారణంగా విద్యుత్ వృథా అవుతోంది. గ్రామాల్లో ఏర్పాటు చేసిన వీధిదీపాలు నిరంతరం వెలుగుతున్నాయి. స్విచ్ ఆఫ్ చేయడానికి వీలు లేకుండా డైరెక్ట్ కనెక్షన్ ఇచ్చారు. తిరుపతి రూరల్ మండలం దుర్గసముద్రంలో వీధి దీపాలు నిరంతరాయంగా వెలుగుతున్నాయి. గ్రామస్తులు ఆపాలని చూసినా స్విచ్ ఏర్పాటు చేయకపోవడంతో అలాగే వదిలేస్తున్నారు. వినియోగదారులు విద్యుత్ పొదుపు చేయాలని నిత్యం ప్రకటనలు ఇచ్చే విద్యుత్‌శాఖ అధికారులు వీధి దీపాలు నిరంతరం వెలిగేలా కనెక్షన్ ఇచ్చి నిర్లక్ష్యంగా వదిలేయడం పట్ల విమర్శలు వస్తున్నాయి.

షెల్టర్‌లో తిష్ట



షెల్టర్ వద్ద బస్సు కోసం నిలబడి వేచి చూస్తున్న ప్రయాణికులు

తిరుపతి అన్నమయ్య సర్కిల్: నిత్యం వాహన రాకపోకలు.. దూరప్రాంతాల నుంచి వచ్చే యాత్రికులతో బస్టాండ్, రైల్వేస్టేషన్ ప్రాంతాలు రద్దీతో ఉంటాయి. అలాగే రైల్వేస్టేషన్ 3, 4 ముఖద్వారాల సమీప ప్రాంతంలో అయితే మరింత ఎక్కువ జనం తాకిడి ఉంటుంది. మరోవైపు శ్రీవారి మెట్టు వెళ్లే ప్రయాణికుల కోసం ప్రత్యేకంగా నిర్మించిన బస్టాప్ షెల్టర్‌ను వీధివ్యాపారులు, తోపుడుబండ్ల నిర్వాహకులు ఆక్రమించేశారు. దీంతో బస్సుల కోసం నిలబడి వేచి ఉంటున్నారు. బస్సుషెల్టర్‌లో ప్రయాణికులు కూర్చొవ డానికి ఏర్పాటు చేసిన కుర్చీలు సైతం మాయమయ్యాయి. కూతవేటు సమీపంలో ఉన్న ఏపీఎస్ ఆర్టీసీ, రైల్వే, పోలీసుశాఖకు చెందిన అధికార సిబ్బంది దీని గురించి పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి బస్‌షెల్టర్‌ను ప్రయాణికుల కోసం అందుబాటులోకి తేవాలని పలువురు కోరుతున్నారు.

మాట్రిక్ థర్మల్-4 పట్టిస్తుంది సుమీ..



హిజ్రాలకు కౌన్సెలింగ్ ఇస్తున్న తిరుచానూరు పోలీసులు

చంద్రగిరి: శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాలతో సోమవారం అర్ధరాత్రి తిరుచానూరు పోలీసులు అధునాతన మాట్రిక్ థర్మల్-4 డ్రోన్ కెమెరాతో నైట్‌బీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా దామినేడు ఇందిరమ్మ కాలనీ పరిధిలోని ఖాళీ ప్రదేశాల్లో హిజ్రాలు అటుగా వెళ్తున్న వాహనదారులను ఆపి ఇబ్బందులు పెడుతున్నట్లు గుర్తించారు. దీంతో సీఐ సునీల్ కుమార్ తన సిబ్బందితో కలసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. రాత్రి సమయాల్లో ఇక్కడ ఏమి చేస్తున్నారంటూ హిజ్రాలను ప్రశ్నించారు. ఇంకోసారి రాత్రి వేళ ఇలాంటి నిర్మానుష్య ప్రాంతాల్లో సంచరించవద్దని, మొదటి తప్పుగా భావించి పంపించేశారు. మరోసారి వాహనాదారులను ఇబ్బందులు పెడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీఐ సునీల్ కుమార్ మాట్లాడుతూ.. తిరుచానూరుతో పాటు పరిసరాల్లో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా తమ నాలుగో కన్ను డ్రోన్ కెమెరాలతో వాటిని కట్టడి చేస్తామన్నారు.

అధికార పార్టీ అక్రమాలపై పోరాడుదాం

– జిల్లా పార్టీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి



నూతనంగా నియమితులైన మండల పార్టీ కమిటీతో సమావేశమైన చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి

తిరుపతి రూరల్: చంద్రగిరిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని ఆ పార్టీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి సూచించారు. తిరుపతి రూరల్ మండలం వైఎస్సార్‌సీపీకి ఎంపికైన నూతన కార్యవర్గంతో మంగళవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజల సంక్షేమం కోసం పోరాటం తప్ప వేరే మార్గం లేదన్నారు. అధికార పార్టీ నేతలు గ్రామస్థాయిలో చేస్తున్న అవినీతి, అరాచకాలు, అవినీతి, అక్రమాలను ప్రజల ముందు పెట్టడానికి మీడియా, సోషల్ మీడియాను విరివిగా వాడుకోవాలన్నారు. తిరుపతి రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు కొత్తపాటి మునీశ్వరరెడ్డి మాట్లాడుతూ పార్టీలో ఎవరికీ ఎలాంటి కష్టం వచ్చినా అందరూ ఒకటై అండగా నిలబడతామన్నారు. పార్టీ కార్యాలయం నుంచి ఏ కార్యక్రమం చేయాలన్నా ఒక్కో పంచాయతీ నుంచి ఐదుగురు నాయకులు హాజరైతే వందల మంది ఒకచోటుకు చేరడానికి అవకాశం ఉంటుందన్నారు. అంతకుముందు నాయకులు చిలమంద మునికృష్ణ, తిరుపతి రూరల్ ఎంపీపీ మూలం చంద్రమోహన్ రెడ్డి, వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి, చెంచుమోహన్ యాదవ్, దామినేటి కేశవులు మాట్లాడుతూ పార్టీని అన్ని విధాలుగా బలోపేతం చేయడానికి కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారన్నారు. పార్టీనేతలు, ప్రజాప్రతినిధులు, కొత్తగా నియమితులైన కమిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.

యోగా మనలో భాగం కావాలి



ర్యాలీ నిర్వహిస్తున్న జిల్లా, నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది

తిరుపతి తుడా: భారతీయుల సనాతన సంపద అయిన యోగాను ప్రతి వ్యక్తి తమ జీవితంలో ఒక భాగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. రాష్ట్రప్రభుత్వం నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా తిరుపతి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ర్యాలీని కలెక్టర్, ఎమ్మెల్యే, కమిషనర్ మౌర్య జెండా ఊపి ప్రారంభించారు. స్థానిక కృష్ణాపురం ఠాణా నుంచి నాలుగుకాళ్ల మండపం వరకు ర్యాలీ చేపట్టి మానవహారం ఏర్పాటు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నెల రోజుల పాటు నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి మండలానికి నలుగురు మాస్టర్ ట్రైనర్లను ఏర్పాటు చేశామని, వారు ఒక్కొక్కరు 200 మందికి ట్రైనింగ్ ఇచ్చి ప్రతి మండలంలో, గ్రామంలోని ప్రతి పౌరుడికి యోగాపై అవగాహన కలిగేలా చూస్తున్నామన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్‌తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మున్సిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్‌ఆఫీసర్ యువఅన్వేష్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఇళ్లు కూల్చడం దారుణం



సీఐకి వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

తిరుచానూరు : తిరుపతి అర్బన్ మండలం తిరుమల నగర్ పంచాయతీకి చెందిన వేణుగోపాల్ కాలనీలో సోమవారం రాత్రి 12 గంటలకు దాదాపు 300 మంది రౌడీలు ఆకతాయిలు ఏడు జేసీబీలు ఒక ట్రాక్టర్‌తో కాలనీలోకి చొరబడి కరెంటు వైర్ కట్ చేసి ఇళ్లు కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు విన్నవించారు. మంగళవారం వారు తిరుచానూరు సీఐకి వినతిపత్రం అందజేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ కాలనీలో మొత్తం 80 ఇళ్లను నేలమట్టం చేశారని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అర్ధరాత్రి దాదాపు 300 మందిపైన ఆకతాయిలు పూటుగా మద్యం సేవించి ఇళ్లను ధ్వంసం చేయడం, అడ్డొచ్చిన వారిని కొట్టడం ఒక ఇంట్లోకి చొరబడి ఐదు సవర్ల బంగారు, రూ.20 వేల నగదు తీసుకెళ్లారని ఆరోపించారు. వారికి న్యాయం చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు పాల్గొన్నారు.

లేపాక్షి నంది నోట్‌బుక్స్ విడుదల



లేపాక్షి నంది నోట్‌బుక్స్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్

తిరుపతి అర్బన్: స్థానిక కలెక్టరేట్ కార్యాలయంలో నూతనంగా ముద్రించి లేపాక్షి నంది నోట్‌బుక్స్‌ను కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ చేతుల మీదుగా మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా లేపాక్షి నంది నోట్‌బుక్స్ జిల్లా డిస్ట్రిబ్యూటర్ జ్ఞానశేఖర్‌రెడ్డి, డిపో ఇన్‌చార్జ్ ధనశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ సరసమైన ధరలకు, నాణ్యతతో కూడిన లేపాక్షి నంది నోట్ బుక్స్‌ను మార్కెట్‌లోకి విడుదల చేశామని తెలిపారు.

పోస్టుమార్టం కేసు విచారణ అధికారి మార్పు

తిరుపతి తుడా: ఎస్వీ వైద్యకళాశాలలో గతంలో ఫోరెన్సిక్ మెడిసిన్ ప్రొఫెసర్‌గా పనిచేసిన డాక్టర్ శశికాంత్‌పై నమోదైన పోస్టుమార్టం కేసు విచారణాధికారిగా ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవిప్రభు నియమితులయ్యారు. గతంలో ఉన్న విచారణాధికారి డాక్టర్ చంద్రశేఖరన్ పదవీ విరమణ చెందడంతో ఆయన విచారణాధికారిగా నియమితులయ్యారు.

బ్రహ్మోత్సవాల నిర్వహణపై సమీక్ష

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయంలో జూన్ 2 నుంచి 10వ తేదీ వరకు జరుగనున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించాలని, ఇందుకు తగిన ఏర్పాట్లు చేపట్టాలని టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం అధికారులను ఆదేశించారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై మంగళవారం సాయంత్రం ఆయన ఆలయ ప్రాంగణంలో అన్ని విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ త్వరితగతిన బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. భక్తులకు అన్నప్రసాదం, వాహన సేవల్లో మజ్జిగ, తాగునీరు, అలాగే రథోత్సవం నాడు పానకం అందించాలన్నారు. హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో కళాకారులతో భజనలు, కోలాటాలు, కేరళ డ్రమ్స్, జానపద నృత్యం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

బ్రహ్మోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ



బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న టీటీడీ ఈఓ శ్యామలరావు, అధికారులు

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి ఆలయంలో జూన్ 2 నుంచి 10వ తేదీ వరకు స్వామి వారి బ్రహ్మోత్సవాలు జరుగనున్న నేపథ్యంలో ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని టీటీడీ ఈఓ జె.శ్యామలరావు అధికారులను ఆదేశించారు. ఈమేరకు మంగళవారం ఆలయ అధికారులతో కలిసి తన చాంబర్‌లో ఈఓ శ్యామలరావు స్వామివారి బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు సౌకర్యవంతంగా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ఆలయంలో చలువ పందిళ్లు, వెబ్‌పెయింట్, ఆకట్టుకునేలా రంగోళీలు, విద్యుత్ అలంకరణలు, పెయింటింగ్స్, పుష్పాలంకరణలు వంటి ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ఉత్సవాల్లో ప్రతిరోజు ఉదయం 7 నుంచి 9 వరకు, తిరిగి రాత్రి 7 నుంచి 9 గంటల వరకు జరగనున్న వాహన సేవలకు ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం, ఆలయ డెప్యూటీ ఈఓ వీఆర్ శాంతి, ఏఈఓ మునికృష్ణారెడ్డి, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

అద్వితీయం.. పౌరాణికం..



కళాకారులను సత్కరిస్తున్న అతిథులు, నిర్వాహకులు



తరమెల్లిపోతున్నదో సాంఘిక నాటికంలోని దృశ్యాలు

తిరుపతి కల్చరల్: సుబ్బరాజు నాట్య కళాపరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి మహతి కళాక్షేత్రంలో ప్రదర్శించిన పౌరాణిక పద్యనాటకం, సాంఘిక నాటకాలు అద్వితీయంగా సాగుతూ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇందులో భాగంగా మొదట గుంటూరు కరణం సురేష్ మెమోరియల్ థియేటర్స్ వారిచే ప్రదర్శించిన 'తరమెల్లిపోతున్నదో' సాంఘిక నాటిక సందేశాత్మకంగా సాగుతూ సభికుల్లో ఆలోచనలు రేకెత్తించింది. ప్రస్తుత సమాజంలో కనుమరుగవుతున్న కుటుంబ వ్యవస్థ నేపథ్యంలో కుటుంబ బంధాల ఔన్నత్యాన్ని ఆవిష్కరిస్తూ జనావళిని జాగృతం చేశారు. అనంతరం సుబ్బరాజు కళాపరిషత్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన 'లవకుశ' పౌరాణిక పద్యనాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. నాటకంలో ప్రతి సన్నివేశానికి అనుగుణంగా అద్భుత రీతిలో కళాకారులు ప్రతి సన్నివేశాన్ని చక్కటి అభినయంతో రక్తికట్టించి ప్రేక్షకుల హృదయాలను రంజింపజేశారు. అనంతరం నటులను సుబ్బరాజు నాట్య కళాపరిషత్ అధ్యక్షుడు కోనేటి సుబ్బరాజు జ్ఞాపికలతో ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు పాల్గొన్నారు.

పిండప్రదానానికి సదుపాయాలు కల్పించండి



టీటీడీ ఈఓకు వినతిపత్రం ఇస్తున్న రెడ్డీస్ భారత్ అసోసియేషన్ బృంద సభ్యులు

తిరుపతి అన్నమయ్యసర్కిల్: తిరుపతి కపిలతీర్థం వద్ద పితృదేవతల పిండ ప్రదానం షెడ్లను ఏర్పాటు చేయాలని మంగళవారం రెడ్డీస్ భారత్ అసోసియేషన్ బృందం టీటీడీ ఈఓ శ్యామలరావుకు వినతిపత్రం సమర్పించారు. హిందూ సనాతన ధర్మంలో పితృదేవతలకు అమావాస్య, సంక్రాంతి, కాల అమావాస్యను పురస్కరించుకుని నగర ప్రజలు పిండప్రదాన సమర్పణ చేస్తారని అసోసియేషన్ అధ్యక్షుడు నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. అత్యంత పవిత్రమైన ఈ కార్యక్రమాన్ని కపిలతీర్థం వద్ద రోడ్లపై కూర్చుని కనీస మౌలిక సదుపాయాలు లేక నగర ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఈఓ దృష్టికి తెచ్చారు. పర్వదినాల్లో పిండప్రదానం కోసం శాశ్వత షెడ్లు, నీటి సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. అలాగే రామచంద్ర పుష్కరిణి, గోవిందరాజస్వామి పుష్కరిణి ప్రాంతాల్లో సైతం మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈఓను కలిసిన వారిలో దుగాండ్ల పురుషోత్తం రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, మునీశ్వర్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, మబ్బు శ్రీమన్నారాయణ రెడ్డి,సిద్ధారెడ్డి,కరుణాకర్ రెడ్డి,మహేష్ ఉన్నారు.

జూన్‌లో విశేష ఉత్సవాలు

చంద్రగిరి: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంతో పాటు అనుబంధ ఆలయాల్లో జూన్ నెలలో విశేష ఉత్సవాలు నిర్వహించనున్నట్లు టీటీడీ అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జూన్ 6, 13, 20, 27 తేదీల్లో శుక్రవారం సాయంత్రం 6 గంటలకు తిరుచ్చి ఉత్సవం నిర్వహించనున్నారు. 7వ తేదీ నుంచి 11 వరకు శ్రీ పద్మావతి అమ్మవారి తెప్పోత్సవాలు, 14న గజ వాహనంపై అమ్మవారు విహారం ఉంటుంది. 5న సూర్యనారాయణ స్వామివారికి సాయంత్రం 5 గంటలకు తిరుచ్చి ఉత్సవం జరగనుంది. శ్రీ సుందరరాజ స్వామి ఆలయంలో జూన్ 17 నుంచి 19 వరకు అవతారోత్సవాలు జరుగుతాయి. 19న సుందరరాజ స్వామివారు సాయంత్రం 6 గంటలకు తిరుచ్చిపై భక్తులకు దర్శనమిస్తారు.

రక్తదానం



రక్తదానం చేస్తున్న ఎన్‌సీసీ విద్యార్థినులు

తిరుపతి సిటీ: ఎన్‌సీసీ శిక్షణలో భాగంగా గర్ల్స్ కేడెట్లు మంగళవారం పెద్దఎత్తున రక్తదానం చేశారు. స్థానిక ఎన్‌సీసీ నగర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 20 మంది ఎన్‌సీసీ విద్యార్థినులు, 10 మంది ఆర్మీ సిబ్బంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో 5వ ఆంధ్ర ఎన్‌సీసీ గర్ల్స్ బెటాలియన్ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ అంజూ వాద్వా, సుబేదార్ మేజర్ శర్మ, చీఫ్ ఆఫీసర్ భారతి, హవల్దార్ వెంకటేశ్, రుయా హాస్పిటల్ రక్తదాన విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

కరెన్సీ నోట్ల అలంకరణలో గంగమ్మ



భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయం



కరెన్సీ నోట్లతో ధనలక్ష్మి అలంకరణలో దర్శనమిస్తున్న తాతయ్యగుంట గంగమ్మ

తిరుపతి కల్చరల్: కాపాడు తల్లీ.. గంగమ్మ అంటూ భక్తజనం మంగళవారం సర్వాంగ సుందరగా అలంకరణలో కొలువైన శ్రీతాతయ్యగుంట గంగమ్మను కోరి ప్రార్థించారు. పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించి అమ్మవారి పాదాల వద్ద ప్రణమిల్లి ప్రార్థించారు. జాతర తరువాత రెండో మంగళవారం వేకువజామున నుంచే భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి విచ్చేసి పొంగళ్లు పెట్టి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీతో శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయం కిక్కిరిసింది. ఆలయంలో అమ్మవారి మూలవిరాట్ విగ్రహానికి అభిషేకం చేశారు. అనంతరం వివిధ కరెన్సీ నోట్లు, పుష్పాలతో గంగమ్మ తల్లిని ధనలక్ష్మి రూపంలో సర్వాంగ సుందరంగా అలంకరించి దర్శనభాగ్యం కల్పించారు. మరికొందరు భక్తులు వేయికళ్ల దుత్తలు నెత్తిన పెట్టుకుని ఆలయ ప్రదక్షిణ చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. మొక్కుబడిలో భాగంగా భక్తులు ఆలయం వద్ద భక్తులకు అంబలి పోసి ప్రసాదాలు వితరణ చేశారు.

కళాకారులు వేషాల మొక్కులు..

మరుపొంగళ్ల సందర్భంగా మంగళవారం రాయలసీమ రంగస్థలి కళాకారులు వివిధ వేషాలతో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

మావోయిస్టుల హత్యలపై విచారణ చేపట్టాలి

తిరుపతి కల్చరల్: మావోయిస్టుల పేరుతో కేంద్రప్రభుత్వం జరుపుతున్న చట్టవ్యతిరేక హత్యలపై న్యాయ విచారణ జరిపించాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు వి.శంకర్ డిమాండ్ చేశారు. నారాయణపురంలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో మంగళవారం సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర స్టాండింగ్ కమిటీ సభ్యుడు కామ్రేడ్ పఠాన్ సత్తార్ సంస్మరణ సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఫాసిస్టు శక్తులు విజృంభిస్తున్న తరుణంలో సత్తార్ వంటి కమ్యూనిస్టు నేతను కోల్పోవడం వామపక్ష ఉద్యమానికి, ప్రత్యేకించి లిబరేషన్ పార్టీకి తీరని లోటని తెలిపారు. ప్రస్తుతం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఒక పక్క దేశ ప్రజల సంపదను కార్పొరేట్ కంపెనీలకు దోచిపెడుతోందని, ప్రశ్నించిన వ్యక్తులను, సంస్థలను ఉక్కుపాదంతో తొక్కేస్తోందని విమర్శించారు. ఈ హత్యలపై సుప్రీంకోర్టు జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హరినాథ్, సత్యనారాయణ, వాసుదేవరావు, వెంకటేశ్వర్లు, విశ్వనాథ్, చెన్నయ్య, ప్రసాద్, నాగార్జున, లలిత, మునిస్వామి, కార్యకర్తలు పాల్గొన్నారు.

విష్ణు నివాసంలో చోరీ

తిరుపతి క్రైం : విష్ణు నివాసంలో గుర్తు తెలియని వ్యక్తులు లాకర్ పగలగొట్టి చోరీకి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈస్ట్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 15వ తేదీన శ్రీవారి దర్శనం కోసం హైదరాబాద్‌కు చెందిన శ్రీదేవి భర్త శ్రీధర్‌రావు విష్ణు నివాసంలో బస చేసేందుకు చేరుకున్నారు. ఆ సమయంలో లాకర్‌ను అద్దెకు తీసుకుని బ్యాగును ఉంచగా.. గుర్తుతెలియని వ్యక్తి లాకర్ పగులగొట్టి అందులో ఉన్న 16. 50 గ్రాముల బంగారును దోచుకెళ్లాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ మద్యం స్వాధీనం..

నగరంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఈస్ట్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తిరుచానూరు రోడ్డులోని అన్నపూర్ణమ్మ గుడి వద్ద పార్కింగ్ స్థలంలో ఓ వ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. ఘటనా స్థలానికి చేరుకుని చూడగా తమిళనాడుకు చెందిన గణపతిగా గుర్తించామన్నారు. అతను అరెస్ట్ చేసి అతని వద్ద ఉన్న కర్ణాటకకు చెందిన టెట్రా ప్యాకెట్‌లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

దుర్గా హోంస్టే సీజ్..

నగరంలోని దుర్గా హోం స్టేలో అక్రమంగా వ్యభిచారం నిర్వహిస్తుండడంతో పోలీసులు రైడ్ చేసి పట్టుకున్న విషయం విదితమే. పోలీసులు మంగళవారం నిందితులు సతీష్‌రెడ్డి, వెంకటేష్‌ను కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించారు. అయితే ఇమ్మోరల్ ట్రాఫిక్ ప్రివెన్షన్ యాక్ట్(ఐటీపీఏ) కింద దుర్గా హోం స్టేను శాశ్వతంగా సీజ్ చేయడంతో పాటు అనుమతిని రద్దు చేయాలని కోరుతూ తిరుపతి ఆర్డీఓకు లేఖ రాశారు. గతంలో కూడా సెవెన్‌హిల్స్ హోం స్టేలో అక్రమంగా వ్యభిచారం నిర్వహిస్తూ పట్టుండడంతో నిందితులపై కేసు నమోదు చేసి అనుమతులను రద్దు చేయడంతో సీజ్ చేయాలని ఆర్డీఓకు లేఖ రాసిన విషయం విదితమే.

బంగారు తిరుచ్చిపై శ్రీకృష్ణుడు



చంద్రగిరి: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయానికి అనుబంధంగా వెలసిన శ్రీకృష్ణస్వామి వారు తన దేవేరులతో కలసి మంగళవారం బంగారు తిరుచ్చి భక్తులను అనుగ్రహించారు. స్వామివారి జన్మనక్షత్రమైన రోహిణి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.